క్లుప్తంగా

హెచ్చరిక బోర్డు ఏర్పాటు



పని ప్రదేశం వద్ద ఏర్పాటు చేసిన హెచ్చరిక బోర్డు

సాక్షి ఎఫెక్ట్..

ములకలపల్లి: 'గో స్లో' అంటూ హెచ్చరిక బోర్డులు ఆర్ అండ్‌బీ శాఖ అధికారులు చేశారు. ములకలపల్లి మండలకేంద్రంలో ఏడాదిన్న క్రితం ప్రారంభమైన సెంట్రల్ లైటింగ్ పనుల పరిస్థితిపై 'తవ్విన రోడ్డుతో వాహనదారులకు ఇక్కట్లు' శీర్షికన సోమవారం 'సాక్షి'లో కథనం ప్రచురితమైన విషయం విధితమే. స్పందించిన అధికారులు హెచ్చరిక బోర్డును మంగళవారం పని ప్రదేశం వద్ద ఏర్పాటు చేశారు. ఐతే ఒక్క బోర్డుతోనే కాకుండా మరిన్ని బోర్డులు ఏర్పాటు చేయాలని స్థానికులు కోరతున్నారు.

కూలర్ల వితరణ

భద్రాచలంటౌన్: భద్రాచలం పట్టణంలోని శాఖా గ్రంథాలయానికి దాతలు రెండు కూలర్లను మంగళవారం వితరణగా అందజేశారు. ఎండలు పెరుగుతున్న నేపథ్యంలో గ్రథాలయానికి వచ్చే పాఠకుల సౌకర్యార్థం పట్టణానికి చెందిన ప్రముఖ ఐటీడీసీ కాంట్రాక్టర్ పాకాల దుర్గప్రసాద్, డాక్టర్ గోళ్ళ భూపతిరావులు కూలర్లను గ్రంథాలయ పాలకుడు జానీకి అందజేయగా.. ఆయన వారికి కృతజ్ఞతలు తెలిపారు. కృష్ణార్జునరావు, భూషణ్ రావు, కడలి నాగరాజు, నాగేంద్ర ప్రసాద్, సుధాకర్, విజయగోపాల్, విద్యార్థులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ అభ్యర్థిని గెలిపించండి

చర్ల: తెలంగాణా జన సమితి తరుపున ఎమ్మెల్సీ అభ్యర్థిగా పోటీలో ఉన్న పన్నాల గోపాలరెడ్డికి మొదటి ప్రాధాన్యతా ఓటును వేసి గెలిపించాలని ఆ పార్టీ ఉమ్మడి ఖమ్మం జిల్లా ఇన్‌చార్జ్ గోపగాని శంకర్‌రావు కోరారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా మంగళవారం మండల కేంద్రంతో పాటు మండలంలోని పలు గ్రామాల్లో ఆయన జిల్లా, డివిజన్ నాయకులతో కలిసి పర్యటించారు. ఇందులో భాగంగా మండల కేంద్రంలోని లక్ష్మీకాలనీలో ఉన్న కేసీబీవీ, ప్రభుత్వ జూనియర్ కళాశాల, ప్రభుత్వ ఉన్నత పాఠశాల, ప్రభుత్వ బాలికోన్నత పాఠశాల తదితర కళాశాలలు, పాఠశాలల్లో పర్యటించి ఓట్లు అభ్యర్థించారు. ఈ కార్యక్రమంలో నాయకులు కొమరం రమాకాంత్, జి.నాగేంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

మృతుడి కుటుంబానికి వితరణ

అశ్వాపురం: మండల పరిధిలోని మల్లెలమడుగు గ్రామానికి చెందిన ముగ్గు కృష్ణ మంగళవారం అనారోగ్యంతో మరణించాడు. నిరుపేద కుటుంబం కావడంతో ఆర్థిక ఇబ్బందులు పడుతుండటంతో మున్నూరుకాపు సంఘం నాయకులు సంఘ సభ్యుల ద్వారా రూ.13,200 దహన సంస్కారాల నిమిత్తం మృతుని కుటుంబానికి అందజేశారు. మున్నూరు కాపు సంఘం మండల అధ్యక్షుడు కమటం వెంకటేశ్వరరావు, మల్లెలమడుగు, మొండికుంట గ్రామాలకు చెందిన మున్నూరుకాపు సంఘం నాయకులు, సభ్యులు పాల్గొన్నారు.

న్యాయం చేయాలి

మణుగూరురూరల్: పదోన్నతులు కల్పించడంలో సింగరేణి ఆపరేటర్లకు న్యాయం చేయాలని కోరుతూ ఐఎన్‌టీయూసీ ఆధ్వర్యంలో మణుగూరు ఏరియా సింగరేణి జీఎం దుర్గం రామచందర్‌కు మంగళవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఐఎన్‌టీయూసీ బ్రాంచ్ ఉపాధ్యక్షుడు వి.కృష్ణంరాజు మాట్లాడుతూ.. పదోన్నతులు కల్పించి ప్రోత్సహించాల్సిన యాజమాన్యం.. అందుకు భిన్నంగా వ్యవహరించడం సరికాదన్నారు. టీటీసీ ఫైనల్ టెస్ట్‌లో అర్హత పొందని, ఐదుగురు ఆపరేటర్లను హెచ్‌ఆర్‌డి విభాగం వారు పదోన్నతి పోస్టులను కల్పించాలని ఆయన జీఎంకు విజ్ఞప్తి చేశారు. సమస్యపై జీఎం సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు. నాయకులు షేక్ అబ్దుల్ రవూఫ్, రామారావు, అజిత్ పాల్గొన్నారు.

మంత్రి దృష్టికి సమస్యలు

గుండాల: మంత్రి, టీబీడబ్ల్యూఎల్ వైస్ చైర్మన్ కొండా సురేఖ అధ్యక్షతన జరిగిన సమావేశంలో పినపాక ఎమ్మెల్యే పాయ వెంకటేశ్వర్లు పాల్గొని ఉమ్మడి గుండాల మండల సమస్యలను రాష్ట్ర కమిటీ దృష్టికి తీసుకు వెళ్లినట్లు పీఎస్ఆర్ పీవీఆర్ కాంగ్రెస్ పార్టీ మండల కోఆర్డినేటర్ ఎస్‌కె.ఖదీర్ తెలిపారు. మంగళవారం విలేకరులతో మాట్లాడుతూ.. హైదరాబాద్‌లోని సెక్రటేరియట్ లో రాష్ట్ర మంత్రి వర్యులు కొండా సురేఖ అధ్యక్షతన జరిగిన 8వ రాష్ట్ర వైల్డ్ లైఫ్ బోర్డు సమావేశంలో గుండాల, ఆళ్లపల్లి మండలాలకు సంబంధించి పలు సమస్యలను తీసుకెళ్లారు. సమస్యల పరిష్కారానికి రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో మంత్రి సమక్షంలో తీర్మానించినట్లు తెలిపారు. గుండాల-రంగాపురం బీటీ రోడ్డు, మామకన్ను-బట్టుపల్లి బీటీ రోడ్డుకు మధ్యలో వాగులపై బ్రిడ్జిలకు అటవీశాఖ అనుమతులు తీసుకురావడం, పనులు ప్రారంభించడంపై తీర్మానించినట్లు పేర్కొన్నారు. తీర్మాణాలపై స్పందించిన మంత్రి సమస్యలు పరిష్కరిస్తానని తెలిపినట్లు ఆయన అన్నారు.

క్షయవ్యాధిని పూర్తిగా నిర్మూలిద్దాం



చంద్రుగొండ: అవగాహన కల్పిస్తున్న డాక్టర్ తనూజ

చంద్రుగొండ: క్షయవ్యాధిని పూర్తిగా నిర్మూలిద్దాని స్థానిక ప్రాథమిక ఆరోగ్యకేంద్రం వైద్యురాలు డాక్టర్ కనకం తనూజ అన్నారు. మండలంలోని పోకలగూడెం గ్రామంలో క్షయవ్యాధి నిర్మూలనపై మంగళవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ వ్యాధి నిర్మూలన కోసం దేశవ్యాప్తంగా నిక్షయ షివిర్ అనే కార్యక్రమాన్ని 100 రోజులపాటు నిర్వహిస్తున్నట్లు ఆమె తెలిపారు. కార్యక్రమంలో ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

మణుగూరురూరల్: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సంయుక్త భాగస్వామ్యంలో నిర్వహిస్తున్న వంద రోజుల నిక్షయ్ షివిర్ ముమ్మర కృషి కార్యక్రమంలో భాగంగా మణుగూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో మంగళవారం కూనవరం గ్రామంలో క్షయవ్యాధి నిర్మూలనపై అవగాహన సదస్సు నిర్వహించారు. తొలుత అనుమానితులను గుర్తించి నమూనాలను సేకరించారు. ఈ సందర్భంగా డాక్టర్ నిశాంత్‌రావు మాట్లాడుతూ.. క్షయ వ్యాధిపై చర్చించుకుని దానిపై అవగాహన పెంచుకోవాలన్నారు. అనంతరం మొబైల్ వాహనంలోని డిజిటల్ ఎక్స్ రే ద్వారా పంచాయతీ కార్యాలయంలో అనుమానితులకు ఎక్స్‌రే, కంటి పరీక్షలు చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్‌బీఎస్‌కె సిబ్బంది, వైద్యసిబ్బందితో పాటు పలువురు స్థానికులు పాల్గొన్నారు.

శిశుగృహను సందర్శించిన న్యాయమూర్తి



పట్టణంలోని శిశుగృహలో భద్రాచలం న్యాయమూర్తి శివనాయక్

భద్రాచలంఅర్బన్: భద్రాచలం పట్టణంలోని బ్రిడ్జి సెంటర్‌లో శిశుగృహతో పాటు సబ్ జైల్‌ను మంగళవారం భద్రాచలం ప్రథమశ్రేణి న్యాయమూర్తి శివ నాయక్ సందర్శించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. శిశుగృహంలో చిన్నారులకు అందుతున్న సౌకర్యాలు, సబ్ జైల్‌లో ఖైదీలకు అందుతున్న సదుపాయాల గురించి ఆరా తీస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో శిశుగృహం మేనేజర్ చంటిబాబు, తదితరులు పాల్గొన్నారు.

తునికాకు సేకరణ ప్రారంభించాలి



అశ్వారావుపేటరూరల్: వినతి పత్రం అందిస్తున్న ప్రజాపంథా నాయకులు

అశ్వారావుపేటరూరల్: తునికాకు సేకరణ పనులు తక్షణమే చేపట్టాలని, వేలం పాటలు నిర్వహించాలని సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్-ప్రజాపంథ పార్టీ పాల్వంచ డివిజనల్ కార్యదర్శి గోగినపల్లి ప్రభాకర్ కోరారు. మంగళవారం స్థానిక రెవెన్యూ, ఫారెస్టు కార్యాలయాల్లో ఆయా అధికారులకు వినతి పత్రాలను అందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. తక్షణమే తునికాకు ప్రూనింగ్ పనులు చేపట్టాలని, తద్వారా ఆదివాసీలతోపాటు ఇతర పేదలకు ఉపాధి దొరుకుతుందన్నారు. అదే విధంగా 50 ఆకుల కట్టకు రూ.5 రూపాయాల ధర నిర్ణయించాలని, గత బోనస్ బకాయిలను చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు వాసం బుచ్చిరాజు, బాడిస లక్ష్మణ్‌రావు తదితరులు పాల్గొన్నారు.

మణుగూరురూరల్: తునికాకు సేకరణ సీజన్‌ను ప్రారంభించాలని కోరుతూ సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ ప్రజాపంథా ఆధ్వర్యంలో మంగళవారం మణుగూరు డివిజన్ ఫారెస్ట్ అడ్మినిస్ట్రేషన్ అధికారి పుల్లారావుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ప్రజాపంథా జిల్లా కార్యదర్శి ముద్దా బిక్షం, మణుగూరు డివిజన్ కార్యదర్శి ఆర్ మధుసూధన్‌రెడ్డిలు మాట్లాడుతూ.. ప్రభుత్వం సకాలంలో తునికాకు యూనిట్లను వేలం వేసి మోడెం నరికించే పనులను చేపట్టాలని, తద్వారా గిరిజన, గిరిజనేతరులకు ఉపాధి దొరుకుతుందన్నారు. కార్యక్రమంలో నాయకులు మిట్టపెల్లి రాజేందర్, ఎం.సతీష్ తదితరులు పాల్గొన్నారు.

జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి కృషి



నూతన కమిటీని సన్మానిస్తున్న ఎమ్మెల్యే ఆదినారాయణ

అశ్వారావుపేటరూరల్: జర్నలిస్టుల సమస్యలపై అవగాహన ఉందని, ఆయా సమస్యల పరిష్కారానిక కృషి చేస్తానని అశ్వారావుపేట ఎమ్మెల్యే జారే ఆదినారాయణ తెలిపారు. అశ్వారావుపేటలో మంగళవారం నిర్వహించిన ప్రెస్‌క్లబ్-అశ్వారావుపేట అసోసియేషన్ ఏడో మహాసభ, నూతన కమిటీ ప్రమాణ స్వీకారోత్సవానికి ఆయన హాజరయ్యారు. తొలుత అధ్యక్ష, కార్యదర్శులు టి.అప్పారావు, వలీపాషా, ఉపాధ్యక్షుడు ఎండి.ముజాఫర్ ఖాన్, కోశాధికారి శీమకుర్తి రవికిరణ్ ప్రమాణం స్వీకారం చేయగా.. ఎమ్మెల్యే మాట్లాడారు. జర్నలిస్టుల ఇళ్ల స్థలాలు, ప్రెస్‌క్లబ్ స్థలం మంజూరుకు కృషి చేస్తానని చెప్పారు. మాజీ ఎమ్మెల్యేలు తాటి వెంకటేశ్వర్లు, మెచ్చా నాగేశ్వరరావు మాట్లాడగా.. ప్రెస్‌క్లబ్ నూతన, పూర్వ కమిటీ బాధ్యులను పలువురు సన్మానించారు. తహసీల్దార్ కృష్ణప్రసాద్, ఏజీ కాలేజీ డీన్ డాక్టర్ హేమంత్‌కుమార్, దమ్మపేట మార్కెట్ చైర్మన్ వాసం రాణి, వివిధ పార్టీల నాయకులు జూపల్లి రమేష్, మొగళ్లపు చెన్నకేశవరావు, తుమ్మా రాంబాబు, సుంకవల్లి వీరభద్రరావు, శ్రీరామ్మూర్తి, మోహన్‌రెడ్డి, ప్రకాశ్‌రావు, రవి, పుల్లయ్య, సలీం, ప్రభాకర్ పాల్గొన్నారు.

కానిస్టేబుల్‌కు ఎస్పీ ప్రశంసలు



అశ్వాపురం: మురళీకృష్ణకు ప్రశంసాపత్రం అందజేస్తున్న ఎస్పీ రోహిత్‌రాజ్



భద్రాచలంఅర్బన్: ప్రసాద్‌ను అభినందిస్తున్న అసిస్టెంట్ ఎస్పీ విక్రాంత్

అశ్వాపురం: అశ్వాపురం పోలీస్‌స్టేషన్ పరిధిలో ఫోన్లు పోగొట్టుకున్న బాధితులకు అధిక సంఖ్యలో రికవరీ చేసినందుకు పోలీస్‌స్టేషన్ కానిస్టేబుల్ మురళికృష్ణని జిల్లా ఎస్పీ రోహిత్‌రాజ్ మంగళవారం అభినందించారు. ఎస్పీ కార్యాలయంలో రోహిత్‌రాజ్ మురళికృష్ణకు ఆయన ప్రశంస పత్రం అందజేశారు.

కానిస్టేబుల్ ప్రసాద్‌కు..

భద్రాచలంఅర్బన్: రాష్ట్ర అథ్లెటిక్స్‌లో మెన్ కేటగిరి విభాగంలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన, భద్రాచలంకు చెందిన పోలీస్ కానిస్టేబుల్ ప్రసాద్‌ను మంగళవారం భద్రాచలం అసిస్టెంట్ ఎస్పీ విక్రాంత్ కుమార్ సింగ్ అభినందించారు. ఇటీవల జరిగిన స్టేట్ అథ్లెటిక్ ఛాంపియన్ షిప్‌లో మూడు విభాగాల్లో 3 మెడల్స్ సాధించి నేషనల్ ఛాంపియన్ షిప్‌కి సెలెక్ట్ అయిన ప్రసాద్. ఇంటర్నేషనల్ స్థాయికి చేరాలని ఆయన ఆకాంక్షించారు. కార్యక్రమంలో భద్రాచలం టౌన్ సీఐ రమేష్ పాల్గొన్నారు.

క్రీడలతో ఆరోగ్యానికి మేలు

దమ్మపేట: క్రీడలు శారీరక, మానసిక దృఢత్వాన్ని పెంపొందించడంతోపాటుగా, మానవ ఆరోగ్యానికి ఎంతగానో మేలు చేస్తాయని బీఆర్ఎస్ జిల్లా నాయకుడు, మాజీ ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరావు అన్నారు. మంగళవారం మండల పరిధిలోని దిబ్బగూడెం గ్రామంలో మాజీ ఎమ్మెల్యే మెచ్చా తన అనుచరులతో కలిసి వాలీబాల్ టోర్నమెంట్‌ను, రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. బీఆర్ఎస్ నాయకులు దారా యుగంధర్, అంకత ఉమామహేశ్వరరావు, కొనుసొతు చిట్టిబాబు, యాట్ల వెంకమ్మ పాల్గొన్నారు.

డీహెచ్‌పీఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా శ్రీనివాస్



బూర్గంపాడు: దళిత కుల పోరాట సమితి(డీహెచ్‌పీఎస్) జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్‌గా సారపాకకు చెందిన పేరాల శ్రీనివాస్‌ను నియమించారు. మంగళవారం పాల్వంచలో జరిగిన డీహెచ్‌పీడీ జిల్లా రెండవ మహాసభలో ఆయనను వర్కింగ్ ప్రెసిడెంట్‌గా ప్రకటించారు. తనపై నమ్మకంతో బాధ్యతలు అప్పగించిన డీహెచ్‌పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు యేసురత్నం, ప్రధాన కార్యదర్శి అనిల్‌కుమార్, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు, సీపీఐ జిల్లా కార్యదర్శి సాబీర్‌పాషాలకు కృతజ్ఞతలు తెలిపారు.

కల్యాణానికి పట్టు వస్త్రాలు అందజేత

మణుగూరురూరల్: మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని మున్సిపాలిటీ పరిధిలోని శివలింగాపురంలోని కాకతీయుల కాలంనాటి స్వయంబు శ్రీనీలకంఠేశ్వరస్వామి దేవాలయంలో శివపార్వతుల కల్యాణం కోసం బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు, పినపాక మాజీ ఎమ్మెల్యే రేగా కాంతారావు మంగళవారం పట్టువస్త్రాలను ఆలయ అర్చకులు శ్రీరామచంద్ర మూర్తికి అందజేశారు. తొలుత మాజీ ఎమ్మెల్యే రేగా కాంతారావు స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. పార్టీ పట్టణ కన్వీనర్ కుంటా లక్ష్మణ్, కో కన్వీనర్ నూకారపు రమేష్, ఆలయ కమిటీ చైర్మన్ కూచిపూడి బాబు, నాయకులు అక్కి నర్సింహరావు, రాంబాబు, సురేష్ పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలు

అశ్వాపురం: మండల కేంద్రంలో అశ్వాపురం-గొందిగూడెం రహదారిపై మంగళవారం రెండు బైక్‌లు ఎదురెదురుగా ఢీకొన్నాయి. ప్రమాదంలో ముగ్గురు వ్యక్తులకు గాయాలయ్యాయి. ముగ్గురులో ఇద్దరు బీజీకొత్తూరు గ్రామానికి చెందిన తోలెం నాగేశ్వరరావు, చంద్రశేఖర్‌గా గుర్తించారు. ఇంకొకరి వివరాలు తెలియాల్సి ఉంది.

శతాధిక వృద్ధురాలికి నివాళి

దమ్మపేట: అనారోగ్యంతో మృతి చెందిన శతాధిక వృద్ధురాలి భౌతిక కాయానికి, స్థానిక ఎమ్మెల్యే జారే ఆదినారాయణ నివాళులర్పించారు. మండల కేంద్రం, దమ్మపేట గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకులు దాసరోజు రామబ్రహ్మచారి మాతృమూర్తి, దాసరోజు లక్ష్మీనరసమ్మ(104) అను శతాధిక వృద్ధురాలు మంగళవారం తెల్లవారుజామున అనారోగ్య కారణంగా ఇంటివద్దనే మృతి చెందారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే జారే, మృతురాలి భౌతిక కాయానికి పూలమాలతో నివాళులర్పించారు. ఆమె కుటుంబ సభ్యులను ఓదార్చి, తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. కార్యక్రమంలో స్థానిక కాంగ్రెస్ నాయకులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

వరి పొలాల సందర్శన



వరి పొలాన్ని పరిశీలిస్తున్న ఏఓ రాహుల్ రెడ్డి

మణుగూరురూరల్: మున్సిపాలిటీ పరిధిలోని అన్నారం, కమలాపురం గ్రామాల్లో వరి పొలాలను మణుగూరు ఏఓ రాహుల్‌రెడ్డి మంగళవారం పరిశీలించారు. చీడపీడలు, తెగుల నివారణకు చేపట్టాల్సిన చర్యల గురించి రైతులకు వివరించారు. ఏఈఓ కొమరం లక్ష్మణ్‌రావు, రైతులు బత్తుల శ్రీను, మాటూరి శ్రీను, పొనుగంటి వీరన్న పాల్గొన్నారు.

అజోలా కల్చర్ ప్రారంభం..

మండలంలోని గుట్టమల్లారం గ్రామపంచాయతీలో ఉన్న రైతువేదికలో మంగళవారం ఏఈఓ కొమరం లక్ష్మణ్‌రావు అజోలా కల్చర్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వరి పంటలో అజోలా వేస్తే పంటకు నత్రజని అంది పెట్టుబడి తగ్గుతుందని, ఈ అజోల్లా కల్చర్ గుట్టమల్లారం రైతువేదికలో లభిస్తుందని తెలిపారు. పంచాయతీ కార్యదర్శి దుర్గాభవాని, వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

లోడింగ్ పెంచాలి



సమావేశంలో మాట్లాడుతున్న సీపీఐ నాయకుడు అయోధ్య

మణుగూరుటౌన్: బొగ్గు లారీలకు లోడింగ్ లేక లారీలు యజమానులు, డ్రైవర్లు, ఇతరులు సుమారు 4వేల కుటుంబాలు దుర్భర జీవితాలు అనుభవిస్తున్నాయని సీపీఐ రాష్ట్ర నాయకుడు అయోధ్య ఆవేదన వ్యక్తం చేశారు. లారీ ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ కార్యాలయంలో మంగళవారం ఆయన మాట్లాడుతూ బీటీపీఎస్‌కు బొగ్గు ఇస్తూ ఇక్కడి లారీ ఓనర్ల జీవితాల్లో చీకట్లు నింపుతున్నారన్నారు. రోజురోజుకు బీటీపీఎస్‌కు బొగ్గు రవాణాను పెంచుతున్నారే తప్ప స్థానిక లారీలకు లోడింగ్ ఇవ్వకపోవడం సరికాదని పేర్కొన్నారు. వారం రోజుల్లో లారీలకు రోజుకు 2వేల టన్నుల బొగ్గు లోడింగ్ ఇవ్వని పక్షంలో అన్ని పార్టీలతోకలిసి నిరసనలు చేపడుతామని తెలిపారు. లారీ ఓనర్ల అసోసియేషన్ అధ్యక్షుడు బాల సత్యనారాయణ, సురేందర్‌రెడ్డి, నాగేశ్వరరావు, రాము, బొజెడ్ల రవి పాల్గొన్నారు.

శివరాత్రికి ముస్తాబైన శైవక్షేత్రాలు

ములకలపల్లి: శైవక్షేత్రాలు శివరాత్రి పర్వదిన వేడుకలను ముస్తాబయ్యాయి. ములకలపల్లి శివారులోని పురాతన శివాలయంలోపాటు, మండలకేంద్రంలోని ఉమా పృథ్వీ రామలింగేశ్వరస్వామి ఆలయాల్లో శివ పార్వతుల వివాహ మహోత్సవానికి సర్వం సిద్ధం చేశారు. ఇప్పటికే మామిడి తోరణాలు, ఇతర సామగ్రితో అలంకరించారు. ఆలయ పురోహితుడు విస్సావఝ్జల సురేశ్ శర్మ ఆధ్వర్యంలో వేడుకలు వైభవంగా జరగనున్నాయి.

చంద్రుగొండ: శివరాత్రి పర్వదిన వేడుకలకు మండంలోని బెండాలపాడు శివారు కనకగిరి గుట్టలపై ఉన్న వీరభద్రుడి ఆలయం ముస్తాబైంది. కాకతీయుల నాటి కట్టడాలున్న ఈ వీరభద్రుడి ఆలయానికి దామరచర్ల గ్రామానికి చెందిన సోమరాజు నర్సింహారావు (రాజా) వంశీయులు వ్యవస్థాపక ధర్మకర్తలుగా ఉన్నారు. వీరి ఆధ్వర్యంలోనే ప్రతియేటా శివరాత్రి ఉత్సవాలు నిర్వహిస్తారు. వేలాదిగా తరలిరానున్న భక్తుల కోసం అన్ని ఏర్పాట్లు చేసినట్లు ఆలయ కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు బొర్రా సురేష్, ఇనగంటి నాగరత్నం తెలిపారు. పది వేల మంది భక్తులకు అన్నదానం చేయనున్నట్లు తెలిపారు. హస్తాలవీరన్న ఆలయం వరకు ఆర్టీసీ బస్సులు నడిపించనున్నట్లు ఆర్టీసీ అధికారులు తెలిపారు.

బూర్గంపాడు: శివరాత్రి పర్వదినం సందర్భంగా మండలంలోని శివాలయాలు సర్వాంగ సుందరంగా ముస్తాబయ్యాయి. మోతెగడ్డ వీరభద్రస్వామి ఆలయంలో స్వామివారి కల్యాణానికి అన్ని ఏర్పాట్లు చేశారు. బూర్గంపాడు, నాగినేనిప్రోలు, మోరంపల్లిబంజర,సారపాకలలోని శివాలయాలు శివరాత్రి వేడుకలకు సర్వం సిద్ధం చేశారు. విద్యుత్ దీపాలంకరణలతో ఆలయాలను ముస్తాబు చేశారు.

పినపాక: మండలంలోని సీతంపేట గ్రామంలోని శ్రీ రాజరాజేశ్వర స్వామి ఆలయం కాకతీయుల కాలంలో నిర్మించబడినదిగా ప్రతీతి. ఇప్పటికే రంగులు వేయడం పూర్తి చేసిన ఆలయ కమిటీ సభ్యులు విద్యుత్ దీపాలతో ఆలయాన్ని అలంకరించారు. చింతల బయ్యారం గ్రామంలోని గోదావరి ఒడ్డున వేంచేసి ఉన్న శ్రీ ఉమా నీలకంఠేశ్వర స్వామి ఆలయానికి అలంకరణ పనులు పూర్తి చేసిన ఆలయ కమిటీ సభ్యులు, కల్యాణ వేడుకకు సంబంధించిన పనులు ప్రారంభించారు. గోదావరి తీరాన ఉన్న ఈ ఆలయానికి తెల్లవారుజామునుంచే భక్తులు అధిక సంఖ్యలో విచ్చేస్తారు. కాగా, శివరాత్రి వేడుకలకు ఏర్పాటు పూర్తి అయినట్లు ఆలయ ప్రధాన అర్చకుడు వినోద్ తెలిపారు.



చంద్రుగొండ: అరణ్యంలో కొలువై ఉన్న హస్తాలవీరన్న స్వామి విగ్రహం



ములకలపల్లి: ఉమా పృథ్వీ రామలింగేశ్వర స్వామి ఆలయంలో మామిడి తోరణాలు కడుతున్న స్థానికులు



పినపాక: ముస్తాబైన చింతల బయ్యారం శివాలయం